ప్రజాశక్తి
ఆదివారం 12 ఫిబ్రవరి 2023



ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ప్రతిభ

ప్రజాశక్తి -పాడేరు: మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ (ఎం హెచ్ఎ) నిర్వహించే అన్ని రాష్ట్ర, కేంద్ర పోలీసు బలగాలకు చెందిన అన్ని ర్యాంకుల అధికారులకు నిర్వహించే ప్రతిష్టాత్మక పోటీలో చింతపల్లి ఏఎస్‌పి ప్రతాప్ కిషోర్ పాల్గొని సిల్వర్ కప్ గెలుచుకున్నారు. హైదరాబాదులోని సర్దార్ వల్లభాయ్ నేషనల్ పోలీస్ అకాడమీలో జరిగిన పాసింగ్ అవుట్ పెరేడ్‌లో ఈ అవార్డును అందుకున్నారు. పిఎంఓ, ఇంటెలిజెన్స్ బ్యూరో, సీనియర్ పోలీసు అధికారులు, వైస్ ఛాన్సలర్, మీడియా ప్రతినిధులతో కూడిన ప్యానెల్ ముందు ఫైనలిస్టులు ప్రదర్శించి ఎంపిక చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అల్లూరి జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విధ్వంసం, అదే సమయంలో ప్రత్యామ్నాయ పంటల సాగు, మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో వికలాంగుల సదరం శిబిరం వంటి వివిధ కమ్యూనిటి కార్యక్రమాలు నిర్వహించారు.



సిల్వర్ కప్‌తో ఎఎస్‌పి

స్వచ్ఛ ఆంధ్ర మిత్రలకు అందని వేతనాలు

- కష్టంగా కుటుంబాల పోషణ
- కార్పొరేషన్‌కు మంజూరు కాని నిధులు
- పంచాయతీల చెల్లింపులతో ఏర్పడిన దుస్థితి



స్వచ్ఛ ఆంధ్ర మిత్రల సమస్యలు తెలుసుకుంటున్న సిఐటియు నేతల (ఫైల్ పాటో)

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర మిత్రలు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 430 గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు ప్రతి 1000 మంది జనాభాకు ఒకరు చొప్పున, ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా 927 మంది స్వచ్ఛ ఆంధ్ర మిత్రలను నియమించింది. గ్రామ పంచాయతీల ద్వారా ఈ స్వచ్ఛంద మిత్రలు తమ పరిధిలోని గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి పొడి చెత్త తడి చెత్త వేరు వేరుగా సేకరణతో పాటు గ్రామాల్లోని కాలువలు, వీధుల్లో రోడ్లు పరిశుభ్రత వంటి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. వీరికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా నెలకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని పలు పంచాయతీలలో ఈ స్వచ్ఛంద మిత్రలు నెల నెలా సక్రమంగా వేతనాలు అందక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో కూడా పంచాయతీ జనాభాను బట్టి ఒకరిద్దరు చొప్పున నియమితులైన స్వచ్ఛ ఆంధ్ర మిత్రలను నియమించారు. గతంలో గ్రీన్ అంబాసిడర్లుగా ఉన్న వీరిని స్వచ్ఛ ఆంధ్ర మిత్రలుగా వ్యవహరిస్తున్నారు. పలు పంచాయతీల్లో ఈ స్వచ్ఛ ఆంధ్ర మిత్రులకు ఇప్పుడు వేతనాల సమస్య ఎదురయ్యింది. దీనిపై అధికారులు స్పందించి తమకు బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతినెలా వేతనాలు అందించాలని స్వచ్ఛ ఆంధ్ర మిత్రలు కోరుతున్నారు.

బకాయిలు సత్వరమే చెల్లించాలి
సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

గ్రామ పంచాయతీలో పని చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర మిత్రలకు బకాయి వేతనాలను సత్వరమే చెల్లించేందుకు సర్పంచులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ కోరారు. తక్కువ వేతనాలు పొందుతున్న శానిటేషన్ కార్మికులకు నెలలు తరబడి వేతనాలు అందని పరిస్థితితో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీకే వీధి మండలంలోని రింతాడ పంచాయతీకి చెందిన స్వచ్ఛ ఆంధ్ర మిత్రులు రమేష్, బాలు, తదితరులకు ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదని, ఈ విషయం తమ దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. ఈ విధంగా పలు గ్రామాలకు చెందిన స్వచ్ఛ ఆంధ్ర మిత్రలు తమ ఆవేదనను వెలిబుచ్చుతున్నారని ఆయన తెలిపారు. దీనిపై జిల్లా ఉన్నత అధికారులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

పంచాయతీల నిధుల నుంచే వేతనాలు

పలు పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర మిత్రలకు వేతనాలు అందని పరిస్థితిపై జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావును ప్రజాశక్తి వివరణ కోరగా, జిల్లాలోని కొన్ని పంచాయతీల్లో సాంకేతిక కారణాలతో కొంతమంది స్వచ్ఛ ఆంధ్ర మిత్రలకు మాత్రమే కొన్ని నెలల వేతనాలు అందని పరిస్థితి ఉందని తెలిపారు. గతేడాది వరకు ఈ స్వచ్ఛంద మిత్రలకు వేతనాల కోసం కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు జరిగేదన్నారు. కొన్ని నెలల నుంచి కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు కానందున ప్రభుత్వం పంచాయతీల ద్వారా స్వచ్ఛ ఆంధ్ర మిత్రలకు. వేతనాలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. అప్పట్నుంచి పంచాయతీ నిధుల నుంచే స్వచ్ఛ ఆంధ్ర మిత్రలకు వేతనాలు చెల్లించే ప్రక్రియ చేపట్టామని తెలిపారు.

తమర్భ కొండలరావు
జిల్లా గ్రామ పంచాయతీ అధికారి
అల్లూరి జిల్లా



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న లోతా రామారావు, విద్యాసాగర్ రెడ్డి

గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజశక్తి-రాజవొమ్మంగి

దేవీపట్నం మండలం ముసినిగుంట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని కె.ఈశ్వరి దేవి మృతిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. శనివారం గిరిజన సంఘం నాయకులు ఈశ్వరి చదువుతున్న పాఠశాలను సందర్శించి, అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరి దేవి మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్త్ చెకప్‌లు మూడు నెలలకు ఒక సారి చేయడం లేదని, తమ కుమార్తెకు సీరియస్ అయ్యేవరకు పాఠశాల సిబ్బంది తమకు ఒక మాట కూడా చెప్పలేదని మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల నుండి అనార్యోగంతో ఉంటే మూడు రోజుల నుండి బాగోలేదని సిబ్బంది తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ పాఠశాలలో రెగ్యులర్‌గా హెల్త్ చెకప్‌లు నిర్వహించకపోవడంతో ఈశ్వరి దేవికి కేవలం 2 పాయింట్లు మాత్రమే బ్లడ్ ఉందన్న విషయం తెలియలేదన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలను అరికట్టడంతో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గతంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వర్కర్లు ఉండేవారని, వారిని ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించడంతో విద్యార్థులకు రెగ్యులర్‌గా వైద్య సేవలు అందక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. గిరిజన విద్య, వైద్యానికి కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఐటీడీఏ హాస్టల్‌లో హెల్త్ వాలంటీర్లను కూడా నియమించలేని దుస్థితిలో ఉన్నాయని విమర్శించారు. ముసిడిగుంట ఆశ్రమ పాఠశాలలో ఉన్న సుమారు 258 మంది విద్యార్థినుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టాలని, గిరిజన వసతి గృహాల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై విద్యార్థి, గిరిజన సంఘాల నాయకులు అనేకమార్లు ఆందోళన చేస్తే వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టింది తప్పా, సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. ఈ విద్యార్థిని మరణానికి ప్రభుత్వం, అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మతి చెందిన బాలిక కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాధల విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతంలో ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందిన పెదబయలు మండలంలోని బాధిత ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చొప్పున పరిహారం చెల్లించాలని టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్ను దొర డిమాండ్ చేశారు. గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేక మైదాన ప్రాంతంలో వలస కూలీలుగా కుటుంబ పోషణం కోసం జీవనం సాగించేందుకు గిరిజన రైతులు యువతీ యువకులు తరలి పోతున్నారని ఆయన వాపోయారు. గిరిజన రైతు కూలీలు మైదాన ప్రాంతానికి వెళ్లి ప్రమాదాలతో శవాలుగా గ్రామాలకు వస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉపాధి హామీ పథకాల ద్వారా పని దినాలు 200 రోజులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పని దినాలు తక్కువ చేసి కూలి లేకుండా చేయడం సరికాదన్నారు. ఉపాధి హామి పథకాలు కేవలం రైతు కూలీలకు మాత్రమే ఉపయోగించి, వారికి ఆదాయం చేకూర్చేలా చేయాలని ఆయన అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వైసీపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఇక్కడ సరిగా పనులు లేకనే మైదాన ప్రాంతాలకు గిరిజనులు తరలి పోతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దొన్నుదొర



పట్టాలు చూపుతున్న లబ్ధిదారులు

గృహ లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంద గ్రామంలో గిరిజన సంఘం నాయకులు పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలను చూపిస్తూ గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవరత్నాల పథకం పేరుతో పేదలందరికీ గృహాలు నిర్మించి ఇస్తామని ప్రకటించి, నేటివరకు ఇంటి స్థలాలు కేటాయించ లేదన్నారు. పట్టాలిచ్చి స్థలాలు కేటాయించ పోవడం దుర్మార్గమన్నారు. ఒక్క వైపు పేదలందరికి ఉచితంగా గృహాలు నిర్మిస్తామని గొప్పలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి పట్టాలు పంపిణి చేసిన లబ్దిదారులకు ఇంటి స్థలాలు కేటాయించి గృహా నిర్మాణాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి మత్తు, జయదేవ్, బంగ్రయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.




గ్రామంలో పర్యటిస్తున్న టిడిపి నాయకులు

గొండెలిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-పాడేరు: నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మడిగా గ్రామాల్లో పర్యటించి వైసీపీ ప్రభుత్వం తీరును దుయ్యబడుతూ ప్రచారం సాగిస్తున్నారు. పాడేరు మండలం గొండెలి గ్రామంలో ఇదేం కర్మ - మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. నియోజక వర్గంలోని టిడిపి ముఖ్య నాయకులంతా కలిసికట్టుగా గ్రామాల్లో పర్యటిస్తున్న తీరు ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మత్యరాస మణికుమారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ యంవివి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వంజంగి కాంతమ్మ, తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి కొట్టగుళ్ళి సుబ్బారావు, పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, నాయకులు కిముడు నారాయణ నాయుడు, రామలింగం నాయుడు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. తాగునీటికి కటకట

- పదేళ్లగా సీసీ రహదారులకు నోచని వైనం
- ఉన్న పైపులైన్లు తవ్వేసి వదిలేయడంతో మంచినీటి ఎద్దడి
- ఇబ్బందులు పడుతున్న ఎస్‌టి, బిసి కాలనీల వాసులు



గోతులు పడి ఉన్న కాలనీలో రహదారి



పెచ్చులూడిపోయిన కన్నులూరుకు వెళ్లే రహదారి

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్ కేంద్రంలోని ఎస్టీ, బీసీ కాలనీల వాసులు అధ్వాన రహదారులు, తాగునీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీల్లో అంతర్గత రహదారులు పూర్తి శిథిలమైన నడిచేందుకు వీల్లేకుండా ఘోరంగా ఉన్నాయి. వర్షాలు పడితే, వరదలొస్తే బురద గుంటల్లో రాకపోకలు సాగించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. అయినా అధికారులు, పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం దురదృష్టకరం. సీసీ రోడ్లు మంజూరయ్యాయని, అదిగో వేస్తున్నాం ఇదిగో వేస్తున్నామంటూ పదేళ్ల నుండి ప్రజలను మభ్యపెడుతూ వస్తున్నారు. ఏజెన్సీలో చింతూరు డివిజన్ కేంద్రంలోని ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల పరిస్థితి చెప్పనక్కరలేదు.

జల్ జీవన్ మిషన్ పథకం కింద ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చేపట్టిన ఇంటింటికి కుళాయిల పనులు మూడు నెలలుగా మూలుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం ఇప్పటికే ఉన్న వీధి కుళాయిలను తవ్వేశారు. కొత్తగా ఇంటింటికి తాగునీటి కుళాయి పనులను ఏ కారణం చేతో తెలియదుగాని మధ్యలో నిలిపివేశారు. దీంతో తాగునీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో తాగునీరు లేక ఎస్టీ బీసీ కాలనీలవాసులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు చింతూరు మండల కేంద్రం నుండి గిరిజన గ్రామమైన కన్నులూరు వరకు కోటీ 50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు వేసిన కొన్ని గంటల వ్యవధిలోనే పెచ్చులూడిపోయాయి. శిథిలమై పాడుబడిన రోడ్డును తలపిస్తుంది. అంటే ఈ రహదారికి కేటాయించిన నిధులు కాంట్రాక్టరు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మేరకు తినేశారో అర్థం చేసుకోవచ్చు. నాసిరకం రోడ్ల నిర్మాణంపై అధికారుల దృష్టికి మీడియా తీసుకు వెళ్లినా ఏమాత్రం స్పందించకుండా మిన్నకుండిపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని కోరుతున్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని స్థానికులు చెబుతున్నారు.

మా బజారుకు రోడ్లు వేయడం లేదు



పది సంవత్సరాలుగా మా బజారులో రోడ్లు శిథిలమై, గోతులమయంగా ఉన్నాయి. బజారులో నడిచేందుకు రోడ్డు సరిగా లేదు. వరదల్లో కొట్టుకుపోయి గోతులు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. వరదల సమయంలో గోతుల్లో దిగి సామాన్లను మోసుకుంటూ వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అయినా అధికారులు, పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదు. మా కాలనీకి అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చిన ప్రతిసారీ ఇదిగో వేస్తామని చెప్పి తరువాత ముఖం చాటేస్తున్నారు. వెంటనే సిసి రోడ్లు నిర్మాణం చేయాలి.

- కోట్ల పెరుమాళ్ళు, బీసీ కాలనీ, చింతూరు.

వేరే బజారు నుండి నీటిని తెచ్చుకుంటున్నాం



ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఉన్న నల్ల పైపులను తొలగించారు. మూడు నెలలు కావస్తున్నా తిరిగి వాటిని ఏర్పాటు చేయలేదు. వేసవికాలం ప్రారంభమవుతున్న కొద్దీ మాకు నీటి ఎద్దడి అధికమైంది. తాగేందుకు మంచినీళ్లు లేవు. వేరే బజారుకు వెళ్లి నీళ్లు మోసుకొని తెచ్చుకుంటున్నాం. తక్షణమే పైపులైను ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలి.

- సున్నం ఆదెమ్మ, ఎస్సీ కాలనీ, చింతూరు

అనారోగ్యంతో ఎఎస్ఐ జగత్‌రాయ్ మృతి



జగత్‌రాయ్ (ఫైల్‌ఫొటో)



కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సిఐ అశోక్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ జగత్ రాయ్ శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో స్థానిక పోలీసులలో విషాదఛాయలు అలముకున్నాయి. జగత్‌రాయ్ మండలంలోని దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేసి, బదిలీపై సీలేరు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఆరు నెలలు అయింది. 1984 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికై వివిధ పోలీస్ స్టేషన్లో సేవలు అందించారు. రెండు రోజుల నుంచి ఆయన అనారోగ్యానికి గురి కావడంతో వైద్య సేవలు అందించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి బాగులేకపోవడంతో స్థానిక ఎస్సై రామకృష్ణ వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం సీలేరు చేరుకున్నారు. జగత్ రాయ్‌కు స్థానిక పిహెచ్‌సిలో వైద్య సేవలు అందించి, మెరుగైన వైద్య సేవ నిమిత్తం శనివారం తెల్లవారుజాము 4.30 గంటలకు అంబులెన్స్‌లో చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందారు. జగత్ రాయ్ మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. ఎస్ఐతో పాటు సిఆర్పిఎఫ్ పార్టీ టు బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, సివిల్ పోలీసులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతదేహాన్ని అరకు సమీపంలో పద్మాపురం గ్రామానికి కుటుంబ సభ్యులు తరలించారు.

25వేలు ఆర్థిక సాయం అందజేత

జగత్ రాయ్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, చింతపల్లి ఎఎస్‌పి శివ కిషోర్ సంతాపాన్ని తెలియజేశారు. అంత్యక్రియలు నిమిత్తం ఆర్థిక సహాయంగా పోలీస్ శాఖ నుంచి రూ.25వేలు చెక్కును చింతపల్లి ఆసుపత్రిలో కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

మృతుని కుటుంబానికి ఎంపీ ఓదార్పు

ప్రజాశక్తి-కొయ్యూరు

దామనపల్లి పంచాయతీకి చెందిన జివిఎంసి ఉద్యోగి అరకు ఆనందరావు విశాఖపట్నం కెజిహెచ్ హాస్పిటల్‌లో మృతి చెందిన విషయం తెలుసుకున్న అరకు ఎంపీ జి.మాధవి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. దగ్గరుండి స్వయంగా అంబులెన్స్ ఏర్పాటు చేసి వారి స్వగృహానికి మృతదేహాన్ని పంపేలా చర్యలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్థిక సహాయం చేశారు.



మృతుడు ఆనందరావు కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎంపీ మాధవి

17న చలో ఐటిడిఎ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కాఫీ రైతులకు బకాయి ప్రోత్సాహక నిధులు వెంటనే చెల్లించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని లోతేరు వారపు సంతలో శనివారం పర్యటించారు. ఈనెల 17న చేపట్టే చలో పాడేరు ఐటిడిఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన మండల కార్యదర్శి పి,రామన్న కోరారు. కాఫీ రైతులకు ప్రోత్సాహక నిధులు తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. ఐటిడిఏ పరిధిలో పాడేరు ఏజెన్సీ11 మండలాలలో ఆర్గానిక్ కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని, గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జిసిసి డిపో పరిధిలో కాఫీ కొనుగోలు చేయాలన్నారు. రూ.60 కోట్లు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే భవిష్యత్తులో దశలవారీగా పోరాటం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాకా లైకోన్, బి.రాజు పాల్గొన్నారు.

డిఇఒగా శామ్యూల్ నియామకం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారిగా కె.శామ్యూల్ని నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న పి.రమేష్ నెల్లూరు జిల్లా వెల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్గా బదిలీ అయ్యారు.

లోక్ అదాలత్లతో సత్వర న్యాయం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: లోక్ అదాలత్లను సద్వినియోగం చేసుకోవాలని, వీటితో సత్వర న్యాయ పరిష్కారం లభిస్తుందని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి లీలావతి కోరారు. స్థానిక న్యాయస్థానాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏళ్ల తరబడి కోర్టులకు తిరగకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. లోక్ అదాలత్లో కేసు ఒక్కసారి రాజీ అయితే అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. లోక్ అదాలత్లో క్రిమినల్, సివిల్ కేసులు న్యాయపరంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎటువంటి ఖర్చులు లేకుండా కాలం వృథా కాకుండా ఇవి దోహదపడతాయని తెలిపారు. చిన్న చిన్న కేసులు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉంటున్నాయన్నారు. న్యాయమూర్తులు మధుసూధనావు, అప్పారావు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో వివిధ శాఖల అధికారుల పనితీరుపై మండల సర్వ సభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు నిలదీశారు. గృహ నిర్మాణం, పశు వైద్యం, ఆర్బీకే, మత్స్యశాఖ తదితర అధికారులపై ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల అధ్యక్షురాలు కోన లోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొని నివేదికలు చదివి వినిపించారు. సైతారుపేటలో పశువైద్యం సరిగా లేదని, అధికారులు వచ్చినపుడు సర్పంచులకు తెలియ చేయలేదని, తాము తోలుబొమ్మలా మారామని సర్పంచ్ రావి రమణబాబు అధికారుల పనితీరును ఎండగట్టారు. ఆర్బీకేలు ఉత్సవ విగ్రహాల మాదిరిగా ఉన్నాయని, రైతాంగానికి ఏ మాత్రం ఉపయోగం లేదన్నారు. మత్స్యశాఖ అధికారులు తమ సమస్యల పరిష్కారంలో ఏమి చేశారంటూ వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీను లేవనెత్తారు. ఎవరేమి అడిగినా అధికారులు తమతమ శాఖల పురోగతిని చదివి వినిపించి మమ అనిపించారు. మొక్కుబడిగా తూతూ మంత్రంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించడంపై సభ్యులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీరామచంద్రమూర్తి, జెడ్పీటిసి కాకర దేవి, సర్పంచ్లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుతో పింఛన్లు పునరుద్ధరణ

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని భీమ బోయినపాలెం గ్రామంలో హైకోర్టు తీర్పుతో లబ్ధిదారులకు పింఛన్లు పునరుద్ధరించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులని గతంలో కొన్ని పెన్షన్స్ ప్రభుత్వ ఉద్యోగులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై తొలగించారని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటీషన్ను భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల మండకిశోర్ వేశారు. ఈ పిటీషన్ను పరిశీలించిన పిమ్మట హైకోర్టు 30-09-2022 నుంచి నిలిపివేసిన పెన్షన్ డబ్బులన్ని కలిపి లబ్ధిదారులకు ఇవ్వవలసిందిగా సదరు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు హైకోర్ట్ ఆదేశాలను అమలు చేయలేదు. దీంతో 7-02-2023న మళ్లీ హైకోర్టులో ప్రభుత్వ అధికారులపై కంటెమ్మెట్ వేశారు. ఇప్పటి వరకు నిలిపివేసిన పింఛన్లు ఇవ్వాలని తీర్పు జారీ చేసింది. దీంతో, ఎంపీడీఓ అరుణశ్రీ లబ్ధిదారులకు శనివారం చెక్ రూపంలో అందజేశారు.

ఎన్నికల నిబంధనలు అమలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నియమావళి శుక్ర వారం నుంచి అమల్లోకి వచ్చిందని తహసీల్దార్ ప్రసాద్ రావు విలేకర్లకు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకూ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టరాదన్నారు.

క్రికెటర్ షబ్నమ్కు సన్మానం

ప్రజాశక్తి -కంచరపాలెం: క్రికెట్లో ప్రపంచ ఖ్యాతినార్జించిన షబ్నమ్ను డివైఎఫ్ఐ, చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన కంచరపాలెంలోని బిఎస్ఆర్ భవన్లో శనివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, షబ్నమ్ వంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత షబ్నమ్ను ఆదర్శంగా తీసుకోవాలని, ఆటలు, పాటలు, విద్య తదితర రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం ఆట స్థలాలు, క్రీడా మైదానాలు ఏర్పాటుచేయడం ద్వారా పిల్లలు క్రీడల్లో మరింతగా రాణించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గర్ల్ ఎంపవర్మెంట్ చైర్మన్ మోదంబిక, బిఎస్ఆర్ ఫౌండేషన్ కన్వీనర్ బుజ్జి, ప్రతినిధి అప్పలరాజు, కృష్ణారావు, శ్రీనివాసరాజు, సంతోష్, ఐద్వా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డాక్టర్ ప్రియాంక, మహమ్మద్ సకిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



షబ్నమ్ సన్మాన సభలో పాల్గొన్న రమాప్రభ తదితరులు

దళారులపై చర్యలు తీసుకోవాలి

వైస్ ఎంపిపి కొండలరావు

ప్రజాశక్తి - హుకుంపేట: వారపు సంతలో మోసాలకు పాల్పడుతున్న దళారులపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు కోరారు. శనివారం వారపు సంతలో సందర్శించి రైతుల కష్టాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ధరలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులు పర్యవేక్షణ లోపంతో వారపు సంతలో దళారులు బెట్టు కాటాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో, రైతులు మోసపోతున్నారని ఆయన అన్నారు. పండించే రైతులకు మోసం చేయడం సరికాదని తెలిపారు..ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పండించిన పంటలకు కనీస ధరకు అమ్ముకోవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించ లేదని విమర్శించారు. అదానీ, అంబానీలపై ఉన్న ప్రేమ రైతులపై చూపించి వ్యవసాయాన్ని ఆదుకోవాలని అన్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటలకు దళారీలతో మోసాలు తప్పడం లేదని ఆయన వాపోయారు. జిల్లా కేంద్రం ఏర్పడినా కూడా మోసాలు జరుగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంపై ఆయన దుయ్యబట్టారు.జిసిసి నుంచి గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓ స్పందించి ఏజెన్సీ జరుగుతున్న వారసంతలో దళారుల మోసాలను అరికట్టాలని ఆయన కోరారు.

శిథిలావస్థలో బస్ షెల్టరు


శిథిలమైన బస్ షెల్టర్

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో కొత్తూరు జంక్షన్ వద్ద ఉన్న బస్సు షెల్టరు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద రేకుల షెడ్డు నీడలో ఎండ నుండి ఉపశమనానికి సేద తీరుతూ బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్ మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

హాస్టల్ వద్ద చెత్త వేయొద్దు

ప్రజాశక్తి-హుకుంపేట

ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ వద్ద చెత్తను వేయరాదని వెల్ఫేర్ అధికారి కన్యాకుమారి సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ ఆవరణలో చుట్టుపక్కల ఉన్న చెత్తను సిబ్బందితో శుభ్రపరచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, హాస్టల్ ఆవరణలో చెత్తను గ్రామస్తులు వేయరాదని ఆమె సూచించారు. చుట్టుపక్క ఇళ్లల్లో ఉన్న వారు చెత్తను హాస్టల్ ఆవరణలో వేయడంతో దుర్గంతం వస్తుందని ఆమె అన్నారు.

కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది



నేరాలు ఘోరాలు

నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-జి.మాడుగుల: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి మండలంలో పలు గ్రామాలలో కొంతమంది దగ్గర సుమారు రూ.5 లక్షల వరకు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఘటన 2018వ సంవత్సరంలో చోటు చేసుకుంది. అప్పట్లో జి.మాడులు పోలీస్ స్టేషన్లో బాధితులు పిర్యాదు చేశారు. ఎట్టకేలకు ఇప్పుడున్న టెక్నాలజీతో జి.మాడుగుల పోలీసులు చాకచక్యంగా ఉపయోగించుకుని ప్రధాన నిందితులైన ఇద్దరినీ శనివారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నిందితులు చండూరు విష్ణుమూర్తి అలియాస్ విష్ణువర్ధన్, బూడిద చిన్నబ్బాయి అలియాస్ శ్రీనివాస్ గా గుర్తించారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పెంట గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దాసరి సత్తిబాబు (29) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై పద్మనాభం ఎస్ఐ భరత్కుమార్రాజు శనివారం కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం... పెంట గ్రామానికి చెందిన దాసరి సత్తిబాబు అదే గ్రామానికి చెందిన తమటపు నారాయణమూర్తికి ట్రాక్టర్కు డ్రైవర్గా పనిచేస్తున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన కరిమిరెడ్డి అప్పలనాయుడు పాత ఇంటి మట్టి గోడలను తొలగించారు. ఆ మట్టిని ట్రాక్టర్తో గ్రామం బయటకు తరలించి తిరిగి వస్తుండుగా మలుపులో బోల్తా పడింది. డ్రైవర్ సత్తిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ యజమాని పోలీసులకు సమాచారమందించారు. మృతుని భార్య దాసరి కొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ నక్కా శ్రీను దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య దాసరి కొండ, ఇద్దరు పిల్లలు, వృద్ధురాలైన తల్లి ఉన్నారు. కుటుంబాన్ని ఎలా పోషించాలని మృతుని భార్య కొండ కన్నీరుమున్నీరవుతున్నారు.

కిటకిటలాడిన సింహగిరి

ప్రజాశక్తి-సింహాచలం: రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సింహగిరి కిక్కిరిసిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లతో కొండపైకి రావడంతో పార్కింగ్కు అవస్థలు పడాల్సి వచ్చింది. రద్దీ కారణంగా భక్తులు స్వామి దర్శనం స్వామి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

అనంతుని ఘాటు రోడ్డుకు రూ.8 కోట్లు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలో ఉన్న అనంతపద్మనాభస్వామి కొండ ఘాటు రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరైనట్లు ఎంపిపి కె.రాంబాబు తెలిపారు. పంచాయతీరాజ్శాఖ విశాఖపట్నం సూపరింటెండెంట్ రవీంద్రబాబు ప్రతిపాదనలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పిఎంజిఎస్వై ఉపాధి హామీ నిధులు మంజూరయాయయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖాధికారులు కొండ ఘాటు రోడ్డును శనివారం పరిశీలించారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి సురేష్రెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇన్స్పెక్టర్ సిరిపురపు కనకరాజు స్వాగతం పలికారు. సురేష్రెడ్డి దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

వీసీల మర్యాద పూర్వక భేటీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : జెఎన్టియు గురజాడ విజయనగరం విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన ఎయు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు కె.వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా ఎయు వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు. ఆయన కార్యాలయంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా వీసీగా నియమితులైన వెంకటసుబ్బయ్యను ప్రసాదరెడ్డి అభినందించారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా రామునాయుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: నర్సీపట్నంకు చెందిన సీనియర్ న్యాయవాది ఎస్.రామునాయుడును అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపిపి)గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సెషన్స్ కేసులను ప్రభుత్వం తరపున ఆయన వాదిస్తారు. గత 32 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు.



వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

గోపవరంలో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని డౌనూరు పంచాయతీ గోపవరం గ్రామంలో శనివారం ఉచిత మెగా డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీసాయి సంజీవని హాస్పిటల్, జనరల్, సుగర్ వ్యాధి నిపుణులు సుర్ల నాయుడు బాబు వారిచే 120 మందికి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, నరాలు, ఎముకలు, విషజ్వరాలు, డెంగ్యూ, చికున్గున్యా, మలేరియా తదితర వైద్య సేవలు అందించారు. బిపి, షుగర్, థైరాయిడ్, ఇతర రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సుర్ల నాయుడుబాబు, సిబ్బంది తులసీ, సుస్మీత, ప్రసాద్కు గోపవరం గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు, చిట్టెంపాడు ఉప సర్పంచ్ పాడి దారలక్ష్మి, స్థానికులు గాంధీ, అప్పన్న బాబు, ఆశ లక్ష్మి, పొల్లుదొర, నాగరాజు, మల్లేశ్వరరావు, వెంకటేష్, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

ఘనంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-చింతూరు : మండల కేంద్రంలోని నది ఒడ్డున వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయ 24వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపు చేశారు. విచిత్ర వేషధారణ, గరగా నృత్యాలతో, బాణాసంచాను కాల్చి అంగరంగ వైభవంగా చేశారు. మహిళలు శబరి జలాలతో అమ్మవారి సన్నిధిలోని విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తాటి చెట్ల కల్లు (నీరా)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించి కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని సీనియర్ న్యాయవాది, గీత కార్మికుల సంఘం నాయకులు గుడిపల్లి సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. శనివారం విజెఎఫ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నీరాను హైదరాబాద్తో సహ ఆ రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో బహిరంగంగా అమ్ముకునే అవకాశం కల్పించిందని చెప్పారు. అదేవిధంగా ఎపిలో కూడా విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాలలో నీరా అమ్మకాలకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే చెట్టు ఎక్కి కల్లు గీసే గీత కార్మికులు ప్రమాదవశాత్తు పడి మరణిస్తే వారి కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ నీరాలో ఆల్కహాల్ లేదని, ప్రకృతి ప్రసాదించిన పానీయమని తెలిపారు.

కేంద్రం దుశ్చర్యలతో..

కునారిల్లుతున్న స్టీల్ప్లాంట్

3 వేల మంది రిటైర్ అయినా భర్తీకి ససేమిరా
- 2019లో రిక్రూట్మెంట్ను రద్దు చేస్తూ బిజెపి సర్కారు ఉత్తర్వులు
- డిపార్టుమెంట్ల్లో పొరుగు సేవలతో అనర్థాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకటా.. రెండా.. లెక్కకు మిక్కిలి తప్పిదాలతో వైజాగ్ స్టీల్ప్లాంట్పై 2014 నుంచీ కేంద్రంలోని బిజెపి సర్కారు కుట్రలు, దుశ్చర్యలకు పాల్పడుతూ ప్లాంట్ మనుగడను ప్రశ్నార్థకమయ్యేలా చేస్తోంది. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్టీల్ప్లాంట్లోని ఎస్ఎంఎస్-2లో జరిగిన భారీ పేలుడు ఘటన ప్లాంట్పై మోడీ కుట్రల ఫలితమేనని విశాఖ అంతటా చర్చ జరుగుతోంది. ఈ భయానక ఘటనతో ప్లాంట్ పరిసరాలన్నీ తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. తొమ్మిది మంది కార్మికులు గాయాలపాలయ్యారు. ఇలాంటి ప్రమాదాలను లెక్కకడితే గడచిన రెండేళ్ల నుంచీ అంటే నూటికి నూరు శాతం ప్రైవేటీకరణకు ప్రధాని మోడీ నిర్ణయం తీసుకున్నప్పటి నుంచీ 103 మంది కార్మికులు గాయపడ్డారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. బిజెపి ప్రైవేటీకరణ నిర్ణయంతో ప్లాంట్ మనుగడపై నీలినీడలు అలుముకున్నాయి. అయినా సరే మొక్కవోని దీక్షతో శ్రమలో ఎలాంటి రాజీపడకుండా స్టీల్ప్లాంట్ కార్మికవర్గం ఉత్పత్తి తగ్గనివ్వకుండా గణనీయమైన ప్రగతి సాధిస్తూ వస్తోంది. ఓ వైపు కార్మికులు ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడుతూనే తీవ్రంగా శ్రమిస్తుండటంతో ప్లాంట్ గత ఏడాది లాభాల్లో నడిచింది. అయినప్పటికీ కేంద్రం కర్మాగారంపై నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది.

మరమ్మతులకు నోచుకోని విభాగాలు

వైజాగ్ స్టీల్ప్లాంట్ దేశంలోనే తీర ప్రాంతంలో ఏర్పాటు చేయబడ్డ తొలి ఉక్కు కర్మాగారంగా ప్రసిద్ధికెక్కింది. సొంత గనులను కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కేటాయించకుండా నిర్లక్ష్యం చేశాయి. బిజెపి 2014లో అధికారంలోకి వచ్చిన నుంచీ ఈ ప్లాంట్ను మరింత ఆగాథంలోకి నెట్టేలా 'ప్రైవేటీకరిస్తాం లేదా కార్పొరేట్లకు అమ్మేస్తాం' అనే నినాదంతో గనులు, నిధులూ ఇవ్వకుండా, రిపేర్లకు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా పూర్తిగా ఎండగట్టేసింది. స్టీల్ప్లాంట్ ఉత్పత్తిని ప్రారంభించి 32 ఏళ్లయింది. అయినప్పటికీ క్యాపిటల్ రిపేర్లకు పలు విభాగాలు వచ్చినా నిధుల కేటాయింపునకు కేంద్రం బడ్జెట్ అనుమతులు ఇవ్వడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఈ రిపేర్లు చేసుకోవడానికి సైతం కేంద్రంలోని మోడీ సర్కారు అనుమతి నిరాకరిస్తూ వచ్చింది. ప్లాంట్ను ఇలా నీరుగారుస్తూ భద్రతా ప్రమాణాలను దిగజార్చుతూ బిజెపి ప్రభుత్వం దుశ్చర్యలు చేస్తూ వచ్చింది. గడచిన నాలుగేళ్లలో సుమారు మూడు వేల మంది ప్లాంట్ నుంచి రిటైర్మెంట్ కాగా వారి స్థానంలో ఒక్కరినీ రెగ్యులర్ పోస్టుల్లో నియమించలేదు. పైగా 2019లో పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్ను కూడా నియంతృత్వంతో బిజెపి రద్దు చేసింది. మరో వైపు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగుల రీ డిప్లాయ్మెంట్ చర్యలు తీవ్రం చేయడం, ఖాళీ అయ్యే విభాగాల్లోకి అనుభవం లేని వారిని పొరుగు సేవలు (అవుట్ సోర్సింగ్)లో నియామకాలు చేయడం వంటివి భద్రతా ప్రమాణాలను దెబ్బతీసేలా చేసి తాజాగా జరిగిన పేలుడు ఘటనల వంటి ప్రమాదాలకు ఆస్కారమిచ్చిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కేంద్ర వైఖరి, దుర్మార్గపు విధానంతో కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాల్లాగ మారిపోయాయి.

ఎఫ్ఆర్ కోట్లు కూడా కార్మికులకు ఇవ్వని కేంద్రం


పేలుడులో గాయపడిన ఉక్కు కార్మికులు

కర్మాగారంలోని కార్మికులకు ఎఫ్ఆర్ జాకెట్ (కోట్)లు కూడా లేవు. యాజమాన్యం వాటిని కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉంది. ప్రమాదం జరిగినా ఎఫ్ఆర్ జాకెట్ శరీరంపై ఉంటే గాయాల తీవ్రత ఇంతగా ఉండేది కాదు. స్టీల్ప్లాంట్ను ప్రైవేటీకరించాలనే కేంద్రం చర్యల వల్ల ఆఖరికి స్పేర్ పార్టులను కూడా యాజమాన్యం ఇవ్వకపోవడం దుర్మార్గం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ప్రైవేటీకరణ చర్యలను ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

జె.అయోధ్యరాం, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్

భద్రతా ప్రమాణాల పాటింపులో తీవ్ర నిర్లక్ష్యం : సిపిఎం

'భద్రతా ప్రమాణాల విషయంలో స్టీల్ప్లాంట్ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా ఉంది. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. ప్లాంట్లో పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గుతున్నా దానికి తగ్గట్టు కేంద్రం రిక్రూట్ చేయడం లేదు. అవుట్సోర్సింగ్ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. ఇది క్షమించరాని చర్య. ఇప్పటికైనా పర్మినెంట్ ఉద్యోగాల భర్తీకి మోడీ సర్కారు చర్యలు చేపట్టాలి. పేలుడు ఘటనలో గాయపడ్డ వారికి పూర్తి స్థాయి వైద్యం అందించాలి. బర్న్ కేర్ యూనిట్తో కూడిన సూపర్ స్పెషాలిటీ ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని కార్మికవర్గం పోరాడుతున్నా కేంద్రం నిర్లక్ష్యం వహించడం దారుణం. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మా పార్టీ ఆశిస్తోంది' అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు.

పేలుడుకు బిజెపియే బాధ్యత వహించాలి

సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

కలెక్టరేట్ : స్టీల్ప్లాంట్ ఎస్ఎంఎస్ - 2లో జరిగిన భారీ పేలుడుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పేలుడు సంఘటన తీవ్ర భయాందోళనకు గురిచేస్తోందన్నారు. బిజెపి రెండేళ్లుగా విశాఖ స్టీల్ప్లాంట్పై అనుసరిస్తున్న కుట్రపూరిత చర్యల వల్ల వరుస ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించి 32 ఏళ్లవడంతో అనేక విభాగాలు క్యాపిటల్ రిపేర్స్కు వచ్చాయన్నారు. రిపేర్స్కు బడ్జెట్ అనుమతులు, నిధులు ఇవ్వకపోవడంతోపాటు కనీసం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరుకు కూడా మద్దతు ఇవ్వకుండా ప్లాంట్ను బిజెపి ప్రభుత్వం అష్టదిగ్బంధం చేసిందన్నారు. మరోవైపు రోజువారీ మెయింటెనెన్స్ను, భద్రతా ప్రమాణాలను ప్లాంట్ మేనేజ్మెంట్ నీరుగారుస్తూ వస్తోందన్నారు. నాలుగేళ్లలో సుమారు 3 వేల మందికిపైగా ఉద్యోగ విరమణ పొందినా వారి స్థానంలో ఒక్కరినీ రిక్రూట్ చేయకపోగా, 2019లో ఇచ్చిన రిక్రూట్మెంట్ను కూడా రద్దు చేసిందన్నారు. కేంద్రం, స్టీల్ యాజమాన్యం అనుసరిస్తున్న చర్యలన్నీ కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా చేశాయన్నారు.



వర్క్షాప్నకు హాజరైన పలు ప్రాంతాల ప్రతినిధులు

కోయ భాషను కాపాడుకుందాం

ప్రజాశక్తి-చింతూరు : కోయత్తోర్ల అస్థిత్వ మూలాలు, కోయ భాష క్రమక్రమంగా అంతరించే దశకు చేరుకున్నాయని, ఆ తెగను, కోయ భాషను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని కోయత్తోర్ బాట వ్యవస్థాపకలు జి.యాదయ్య అన్నారు. మండలంలోని రామన్న పాలెంలో కోయత్తోర్ బాట, సమత నిర్వాహణలో కోయ బాల సాహిత్యం అనే అంశంపై నాలుగు రోజులపాటు ఆదివాసీ యువకులు, పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కార్యశాల (వర్క్ షాప్) శనివారం ముగిసింది. ముగింపు సభలో యాదయ్య మాట్లాడుతూ ఒకే భాష గల, ఒకే మూలం నుండి వచ్చిన ప్రజలు భాష కోల్పోయిన పరిస్థితులు కనిపిస్తాయని, వీటిపై భాషా శాస్త్ర వేత్తలు, భాషా శాస్త్ర పరిశోధన సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమత సంస్థ కో-ఆర్డినేటర్లు గునపర్తి సైమన్, కందుకూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ భాష ప్రయుక్త రాష్ట్రాలుగా ఒరిస్సా, మధ్యప్రదేశ్, చత్తీస్ఘడ్, ఆంధప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలుగా విభజించటంతో ఆయా రాష్ట్రాల్లో కోయత్తోర్ భాషకు ప్రాధాన్యత లేకుండా పోయిందని తెలిపారు. విచ్ఛిన్నమైన కోయ భాష మూల పదాలు భద్ర పరచటం కోసం ఇది ఒక గొప్ప ప్రయత్నమని తెలిపారు. ఆదివాసీ అస్థిత్వ మూలాలు, సంస్కృతి సాంప్రదాయాలు, జీవన విధానంతో ముడి పడి ఉన్నందున దీని రక్షణకు దేశవ్యాప్తంగా బహుళ ప్రచారం జరగాలన్నారు. కోయ భాష విస్మృతికి ఇంకా పరిశోధనలు చేయాల్సిన బాధ్యత, ఆవశ్యకత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. కోయత్తోర్ బాట అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండు ఆధ్వర్యంలో కోయ భాష పదాలు గుర్తించడం, విద్యార్థులతో పదాలు పలికించడం వంటి అంశాలపై నాలుగు రోజుల పాటు చర్చ గోష్టి నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కోయుతూర్ తెగల ఆనాటి జీవన విధానం, వారు ధరించే వస్త్రాలు, పనిముట్లు ఇతరాత్ర అంశాలపై ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్న గిరిమిత్ర సంస్థ కార్యదర్శి బండి గంగరాజు, వినియోగదారుల సంఘం కార్యదర్శి చిట్టిబాబు, కృష్ణ, దుమ్మిరి వెంకన్న బాబు, సున్నం ఈశ్వర్ కుమార్, జి రాఘవ, దుమ్మిరి భీమమ్మ, కట్టం కిరణ్ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి రెబల్ అభ్యర్థిగా శ్రీరామమూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి తెలిపారు. ఇప్పటికే టిడిపి అభ్యర్థిగా చిరంజీవిరావు పేరును ఆ పార్టీ ప్రకటించింది. శ్రీరామమూర్తి కూడా అదే పార్టీకి చెందినవారు కావడంతో టిడిపి అభ్యర్థికి రెబల్ బెడద చోటుచేసుకుంది. శనివారం విజెఎఫ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీరామమూర్తి మాట్లాడుతూ అన్ని రంగాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన విద్యావంతుడైన తనకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయం చేకూర్చాలని కోరారు. టిడిపి ఆవిర్భావం నుంచి క్రమశిక్షణగల నాయకునిగా పార్టీలో తాను కొనసాగుతుండగా తనకు వచ్చిన రాజకీయ అవకాశాలను పార్టీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు అడ్డుకున్నారని ఆరోపించారు. పార్టీ అధిష్టానం అన్ని విధాలా తనకు పదవులను కల్పించడానికి ప్రయత్నించినప్పటికీ ఆయన వ్యక్తిగత కక్షతో పార్టీకి వ్యతిరేక సంకేతాలు పంపి, తన రాజకీయ జీవితంలో ఎటువంటి పదవులూ రాకుండా చేశారని తెలిపారు. అందుకే తాను ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అనకాపల్లి జిల్లా చోడవరం నియోజవర్గం బుచ్చయ్యపేట మండలం భీమవరం తన స్వగ్రామమని, అంచెలంచెలుగా ఎదిగి స్పెషల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్గా పనిచేసి 40 ఏళ్లుగా వివిధ ఉద్యోగ సంఘాలకు నాయకునిగా ఉన్నారన్నారు. సమావేశంలో రెవెన్యూ సంఘం మాజీ అధ్యక్షులు గొర్లె అప్పలనాయుడు, చోడవరం మదర్ థెరిసా ఇనిస్టిట్యూట్ చైర్మన్ ఎవిఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.